క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్ దోత్రేని జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్, నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. నాయకులు ఇరుకుల మంగ, మరళీ, గాజుల రవీందర్, బాలయ్య, సురేష్, అబ్బు, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

పాత పద్ధతుల్లో వివాహాలు జరపాలి



మాట్లాడుతున్న ఆత్రం లక్ష్మణ్

కెరమెరి: వివాహ కార్యక్రమాలను పాత పద్ధతుల్లో నిర్వహించుకోవాలని రాయిసెంటర్ సభ్యులు తీర్మానించారు. మండల కేంద్రంలోని ఝరి రాయిసెంటర్‌లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. దుబారా ఖర్చులు, కట్నకానుకలు అరికట్టాలని పేర్కొన్నారు. కెరమెరిలో నిర్వహించే జాతర కాలపరిమితిలో జరుపుకోవాలని, ఈనెల 8 నుంచి 17 వరకు కొనసాగాలని తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, తహసీల్దార్, కెరమెరి ఎస్సైకి అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ ఆత్రం లక్ష్మణ్, రాయిసెంటర్ సర్‌మోడీలు, సభ్యులు ఆత్రం బొజ్జిరావు, పెందోర్ దంబిరావు, ఆర్‌ఎస్ జంగు, కనక శంకర్, బారిక్‌రావు, శ్యాంరావు, దందేరావు, రఘునాథ్‌రావు, మారు, సోము, జల్పతిరావు, న్యానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు వినియోగించుకోవాలి



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వం అందిస్తున్న రుణాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని మాలన్‌గొంది, తుంపెల్లి గ్రామాల్లో మంగళవారం బ్యాంకు, స్త్రీ నిధి, వాటర్ షెడ్ రుణాలకు సంబంధించి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగేందుకు ప్రభుత్వం రుణాలు అందిస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, ఏపీఎం శ్రీనివాస్, స్త్రీ నిధి మేనేజర్ హొక్టు, సీసీ హనుమంతు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'పల్స్‌పోలియో' విజయవంతం



వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఈ నెల 3న ప్రారంభమైన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి తుకారాం భట్ తెలిపారు. జిల్లాలో 57,362 మంది ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించగా.. మూడు రోజుల్లో 57,493 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని పేర్కొన్నారు. 100.2 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. మంగళవారం వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ 507 మంది చిన్నారులకు చుక్కలు వేశారని తెలిపారు. కాగా.. జిల్లా కేంద్రంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

దహెగాంలో..

దహెగాం: గత మూడు రోజులుగా మండలంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం మంగళవారంతో ముగిసిందని వైద్యాధికారిని స్పందన తెలిపారు. మండలంలో ఐదేళ్లలోపు 3,805 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్ధి హనుమాన్.. మహా జాతర

- 8న ఆలయంలో ఉత్సవాలు
- నేటి నుంచి పూజా కార్యక్రమాలు
- ఏర్పాట్లు పూర్తి



తాటిపల్లిలోని హనుమాన్ ఆలయం

కౌటాల: మండలంలోని తాటిపల్లి సమీపంలోని వార్ధా నది ఒడ్డున వెలసిన శ్రీ సిద్ధిహనుమాన్ ఆలయం ప్రకృతిఒడి మధ్యన ఉంది. చుట్టూ ఆహ్లాద వాతావరణం, భక్తుల రాకతో పర్యాటక శోభ సంతరించుకుంటోంది. భక్తుల కోర్కెలు తీర్చే హనుమాన్‌గా విరాజిల్లుతోంది. జిల్లా నుంచే కాక తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన వేలాది భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని ఆలయంలో బుధవారం నుంచి ఉత్సవాలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

40 ఏళ్లుగా..

19వ శతాబ్దంలో తాటిపల్లి శివారులోని వార్ధానది మధ్యలో ఎత్తైన ప్రదేశంలో హన్మాన్ ఆలయం వెలిసింది. సుమారు 65 ఏళ్ల చరిత్ర ఉంది. నది నీరు ఉధృతంగా ప్రవహించినప్పుడు హన్మాన్ విగ్రహం వెలిసిందని పలువురు భక్తులు చెబుతుంటారు. విగ్రహం వెలిసిన చోట గ్రామస్తులు పందిరి వేసి పూజలు చేశారు. భక్తులు తరలివస్తుండడంతో ప్రతీ శివరాత్రికి తాటిపల్లి వార్ధా నది ఒడ్డున (కుర్తా) జాతర ప్రారంభించారు. వారి కానుకలతోనే తాటిపల్లి గ్రామస్తుల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు మందిరాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఏటా జాతరకు మహారాష్ట్ర నుంచి ప్రత్యేక నాటిక బృందాలతో ప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. వచ్చిన డబ్బులతో కమిటీ సభ్యులు ఆలయాభివృద్ధికి కృషి చేస్తుంటారు.

తెలుగు–మరాఠీ సంప్రదాయాలు

హన్మాన్ ఆలయం ఇటు తెలుగు, అటు మరాఠా ప్రజల సంప్రదాయాలకు నిలయంగా ఉంది. ఏటా శివరాత్రికి ఇక్కడ జరిగే జాతరకు మహారాష్ట్ర భక్తులు ఇటు తెలంగాణలో సంప్రదాయాల ప్రకారం మొక్కు చెల్లించుకుంటారు. ఇక్కడే ఇరు రాష్ట్రాల ప్రజల సమ్మేళనం జరుగుతుంది. జాతర సందర్భంగా సామూహిక భోజనాలు చేస్తుంటారు. జాతర నిర్వహించే వారం రోజులుగా మరాఠీ, తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలను కమిటీ సభ్యులు నిర్వహిస్తుంటారు.

నేటి నుంచి పూజాకార్యక్రమాలు

మహాశివరాత్రి పురస్కరించుకొని హన్మాన్ ఆలయంలో నేటి నుంచి నుంచి 10వ తేదీ వరకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీరోజు ఉదయం 6 గంటలకు మహాహారతి, మధ్యాహ్నం 12 గంటలకు భజన, 8న మహా జాతర, 9న 'కాడో క్' మరాఠీ నాటక ప్రదర్శన చేపట్టనున్నారు. తాటిపల్లి వరకు తారు రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సు సౌకర్యం లేకపోవడంతో భక్తులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. జాతర సందర్భంగా ఆలయం వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆర్టీసీ బస్సు సేవలు కల్పించాలని కోరుతున్నారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి



గత 40 ఏళ్లుగా మహాశివరాత్రి జాతరను నిర్వహిస్తున్నాం. ఆలయంలో ఐదు రోజులు ఉత్సవాలు నిర్వహిస్తాం. 8న మహా జాతర, ఇక్కడకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం. ఆలయంలో సౌకర్యాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ఎల్ములే దత్తు, ఆలయ కమిటీ చైర్మన్

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే కోరారు. జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా సవరణపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు, తాగునీరు, ఫర్నిచర్, ర్యాంప్, మరుగుదొడ్లు, విద్యుత్, షామియానా ఇతర మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 52 అదనపు పోలింగ్ కేంద్రాలు, సిర్పూర్ నియోజకవర్గంలో 27 అదనపు సహాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటిలోని జీఎం కార్యాలయంలో కారుణ్య నియామకాల కోసం ఏరియా అధికారులు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఏరియాలో ఇద్దరు మృతి చెందిన ఉద్యోగుల కుటుంబీకులు, ఇద్దరు మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ అయిన ఉద్యోగులు కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకోగా ఎస్వోటూ జీఎం మచ్చగిరి నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతిలు అభ్యర్థులు ధ్రువపత్రాలు పరిశీలించారు. సంస్థ ద్వారా అందే బెనిఫిట్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కారుణ్య నియామకాల ప్రక్రియను పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. డీజీఎం సివిల్ సతీశ్‌బాబు, డీజీఎం సీహెచ్‌పీ భీంరావు జాడే, సెక్యూరిటీ మేనేజర్ వరప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.

'ఎంపీ టికెట్ సోయం బాపూరావుకే కేటాయించాలి'



సమావేశంలో చర్చిస్తున్న రాయిసెంటర్ సార్‌మెడీలు

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావుకే మళ్లీ బీజేపీ ఎంపీ టికెట్ కేటాయించాలని కేస్లాపూర్, వడగామ్, నర్సపూర్, వడగామ్ రాయిసెంటర్ల సారమెడీలు మెస్రం వెంకట్‌రావ్, మెస్రం చిన్నుపటేల్, కొట్నాక్ దేవ్‌షావ్, తుంరం జుగాదిరావ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నాలుగు రాయిసెంటర్ సార్‌మెడీలు ఆయా గ్రామాల ప్రజలతో సమావేశమై చర్చించారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రధాన మంత్రి మోదీ పర్యటన ఎంపీ సోయం బాపూరావు చొరవతో ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలిరావడంతో సభ విజయవంతమైందన్నారు. అదే విధంగా గత 2019 ఎన్నికల్లో సోయం బాపురావ్‌కు టికెట్ కేటాయించడంతో భారీ మెజార్టీతో విజయం సాధించినట్లు తెలిపారు. ఈసారి సైతం ఎంపీ టికెట్‌ను ఆయనకే కేటాయిస్తే ఉమ్మడి జిల్లా రాయిసెంటర్ల సార్‌మెడీలు, పటేల్ వ్యవస్థ ఏకమై భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపిస్తామన్నారు. బీజేపీ అధిష్టానం చొరవ తీసుకుని మరోసారి టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయిసెంటర్ సలహాదారు వెట్టి రాజేశ్వర్, ఆయా గ్రామాల పెద్దలు మెస్రం బాదిరావ్ పటేల్, మెస్రం కోసేరావ్, దాదారావ్, నాగోరావ్, మనోజ్ ఉన్నారు.

'ఎంపీ టికెట్ ఇవ్వాలి'



మాట్లాడుతున్న ఆత్రం భాస్కర్

బెజ్జూర్: కాంగ్రెస్ అధిష్టానం తనకు ఆదిలాబాద్ లోక్‌సభ టికెట్ ఇవ్వాలని ఆశవాహ అభ్యర్థి ఆత్రం భాస్కర్ కోరారు. మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, సీనియర్ నాయకులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న ఎంపీ.. వెనుకబడిన బెజ్జూర్ మండలంలో అభివృద్ధి చేయలేదన్నారు. కష్టపడి పనిచేయాలని, మీ వెంట ఉంటామని, బెజ్జూర్ మండలం తరపున పూర్తి మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, ఆత్రం భాస్కర్ యువ సైన్యం సభ్యులు పాల్గొన్నారు.

మోదీ సభలో పాల్వాయి



మోదీ సభలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కౌటాల: సంగారెడ్డిలో మంగళవారం నిర్వహించిన ప్రధాని మోదీ విజయసంకల్ప సభలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొన్నారు. దేశంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. సిర్పూర్ నియోజకవర్గాన్ని కేంద్ర సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆత్మస్థైర్యంతోముందుకు సాగాలి

జైనూర్: మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలని సీడీపీవో ఇందిరమ్మ అన్నారు. మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బుధవారం జిల్లా కలెక్టర్ తన కార్యాలయంలో బహుమతులు అందించనున్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెంటుబాయి, లైలా, డీచ్ ఈవో రాణి, రాజేశ్వరి, సఖి సిబ్బంది శ్రీనిధి, సత్యశీల తదితరులు ఉన్నారు

గుండి వంతెన పనులు ప్రారంభించాలి

ఆసిఫాబాద్‌రూరల్: గుండి వంతెన పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ రవీందర్ హైదరా బాద్‌లోని ప్రజాభవన్‌లో మంగళవారం ప్రజా వాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన పనులు ప్రారంభించి గత 15 ఏళ్లు గడిచినా ఇప్పటికి పూర్తి కాలేదన్నారు.

పథకాలపై అవగాహన

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని వివేకానందచౌక్ వద్ద తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కళాబృందం సభ్యులు మంగళవారం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ఆరు గ్యారంటీలు, వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాల గురించి వివరించారు. కళాజాత బృందం టీం లీడర్ మోహన్‌నాయక్, సభ్యులు గుడిసెల బాబు, బొమ్మగోని వెన్నెల, గుండా శిరీష, కోదాడ సోమశేఖర్, మరప పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరి

ఆసిఫాబాద్‌అర్బన్: వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని, లేకుండా నడిపితే వాహనదారులపై చర్యలు తప్పవని ఎస్ హెచ్‌వో సతీశ్ అన్నారు. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని 40 వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌వో సతీశ్ మా ట్లాడుతూ నంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు కేసు నమోదు చేసి, కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్టణంలో నంబర్ ప్లేట్ లేని వాహనాలతో చైన్‌స్నాచింగ్, చోరీలు, మహిళల ను వెంబడించడం చేస్తున్నారని పేర్కొన్నారు.

రెబ్బెన: నంబర్ ప్లేటులేని వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చంద్రశేఖర్ హెచ్చరించారు. ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు నంబరు ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలపై మంగళవారం గోలేటి ఎక్స్‌రోడ్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సిబ్బంది మహేందర్, అంజన్న, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో గోపికాంత్

కెరమెరి: మండలంలోని ఫయ్యాజ్ సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ దుకాణాలను ఏవో గోపీకాంత్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఎక్స్‌పైరీ అయిన మందులు, ఎరువులు, విత్తనాలను విక్రయించొద్దన్నారు. 350 మంది రైతులు ఈకేవైసీ చేయలేదన్నారు. త్వరలో ఈకేవైసీ చేయాలన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

వాంకిడి: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ అన్నారు. మండల కేంద్రంలో డైలీ క్రికెట్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో పోలీస్ అండ్ ప్రెస్ మధ్య మంగళవారం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. మ్యాచ్ అనంతరం సీఐ, ఎస్సైలు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దెకు వ్యవసాయ యంత్రాలు

- మండల కేంద్రంలో అందుబాటులో యంత్రాలు
- తక్కువ ధరలకే లభిస్తుండడంతో ప్రయోజనకరం
- రైతులు సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



మండల సమాఖ్యలో అద్దెకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న యంత్రాలు

తిర్యాణి: చాలా మంది రైతులు సాగు చేసేందుకు అవసరమయ్యే యంత్రాలు లేక అనేక ఇబ్బందులు పడుతుంటారు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద యంత్రాలను అద్దెకు తీసుకొని వినియోగిస్తుంటారు. దీంతో రైతులకు పంటల సాగు ఆర్థికంగా భారంగా మారింది. దీనిని నివారించేందుకు మండల సమాఖ్య గత ఏడాది నుంచి సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. తక్కువ రేటుకే రైతులకు రోజువారీ అద్దె రూపంలో యంత్రాలను అందిస్తుంది. దీంతో మండల సమాఖ్య ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు రైతులకు సైతం లబ్ధి చేకూరనుంది.

రైతులతో ఒప్పందం..

మండల సమాఖ్య సభ్యులు రైతులకు యంత్రాలను ఇచ్చే సమయంలో వారితో ఒప్పందం చేసుకుంటారు. ఈ ఒప్పందం ప్రకారం ఎన్ని రోజులకు అద్దె తీసుకుంటున్నారో అందుకు అయ్యే రుసుంలో 50శాతం ముందుగా అడ్వాన్సు కింద చెల్లించాల్సి ఉంటుంది. అద్దెకు తీసుకున్న సమయంలో యంత్రాలు చెడిపోవడం లేదా మరమ్మతులకు గురైతే వాటికి అయ్యే ఖర్చును రైతులే చెల్లించాల్సి ఉంటుంది. అయితే రైతులు వ్యవసాయ పరికరాలు పొందేందుకు తప్పనిసరిగా పట్టాపాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లను సమర్పించాల్సి ఉంటుంది.

అద్దెకు లభించే యంత్రాలు ఇవే..

జంగుబాయి సమాఖ్య కార్యాలయంలో మొత్తంగా 11 రకాల యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని రోజు లెక్కన అద్దెకు ఇస్తారు. కాగా ట్రాక్టర్ అద్దె (రోజుకు) రూ.1400, ట్రాలీ రూ. 600, ప్లావ్ రూ. 500, కల్టివేటర్ రూ.500, కాటన్ షెడ్డర్, రోటవెటర్ రూ. 1000, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్లర్ రూ. 1000, పవర్ వీడర్ రూ.500, బూమ్ స్ప్రేయర్ రూ. 1000, తైవాన్ స్ప్రేయర్ రూ. 200, బ్యాటరీ స్ప్రేయర్ రూ.100 రోజు వారి అద్దెగా నిర్ణయించారు. మహిళ సంఘాలలోని సభ్యులకు మరింత తక్కువ ధరకే అద్దెకు ఇస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. యాసంగి పంటల సాగు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ పరికరాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



మండల సమాఖ్య కార్యాలయంలో తక్కువ ధరకు 11రకాల యంత్రాలను అద్దెకు ఇస్తున్నాం. ఇందుకోసం రైతుతో ముందుగానే ఒప్పందం చేసుకుంటున్నాం. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే మండల సమాఖ్యలో అతి తక్కువ ధరకే యంత్రాలు లభిస్తున్నాయి. మహిళా సంఘాల్లోని సభ్యులకు మరింత తక్కువ ధరలకు అందజేస్తున్నాం.

– సదానందం, ఏపీఎం, తిర్యాణి

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న సిద్దంశెట్టి రాజమౌళి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీ స్వల్పఓట్ల తేడాతో ఓటమి చెందినప్పటికి యూనియన్‌లోని ఏ కార్యకర్త మనోధైర్యాన్ని కోల్పోకుండా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీనియర్ ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి రాజమౌళి అన్నారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. యూనియన్ కార్యకర్తలు కార్మికులకు అందుబాటులో ఉండాలన్నారు. ఏరియా కమిటీని యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఆమోదం అనంతరం ప్రకటిస్తామన్నారు. సీనియర్ నాయకుడు ప్రకాశ్‌రావు మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో బదిలీ చేసిన జనరల్ మజ్దూర్ ఉద్యోగులను వేరే ఏరియాకు బదిలీ చేస్తే యాజమాన్యంతో జనక్‌ప్రసాద్ మాట్లాడి బదిలీ ఉత్తర్వులు నిలిపివేయించారని అన్నారు. సమావేశంలో బ్రాంచి కార్యదర్శి మాధవకృష్ణ, చంద్రకుమార్, మాసాడి నారాయణ, రామారావు, ఇన్‌చార్జీలు భీమేష్, రవి, కోటి, వినయ్, రవి, శ్రీను, ప్రభాకర్, కుమారస్వామి, తిరుపతి, రఫి పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

లింగాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం సేవలందిస్తోందని పేర్కొన్నారు. ప్రజల తమ దరఖాస్తులు అందించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీమాతో కుటుంబానికి ధీమా

బెజ్జూర్: బీమాతో కుటుంబానికి ధీమా ఉంటుందని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సతీశ్‌కుమార్, ఐపీపీబీ మంచిర్యాల బ్రాంచి సీనియర్ మేనేజర్ వెంకట్, చీఫ్ మేనేజర్ ఐపీపీబీ భాస్కర్, బ్రాంచి మేనేజర్ సాగర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన మధునయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని, పోస్టాఫీసులో ప్రమాద బీమా చేసుకోవడంతో నామిని అయిన భార్య గంగుబాయికు కాగజ్‌నగర్ సబ్ డివిజన్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో మంగళవారం రూ.10 లక్షల చెక్కును అందజేశారు. పోస్ట్ మాస్టర్ చంద్రశేఖర్, వెంకటరమణ పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని మోకాసిగూడ గ్రామానికి చెందిన కోట్నాక రఘునాథ్ మృతి చెందగా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం కింద రూ.2 లక్షలు మంజూరయ్యాయి. మృతుడి భార్యకు ఎస్బీఐ మేనేజర్ నందకృష్ణ మంగళవారం బీమా చెక్కు అందజేశారు. ఫీల్డ్ ఆఫీసర్ వివేక్ తదితరులు ఉన్నారు.

పరామర్శ

జైనూర్: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీ ఇటీవల గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న సిర్పూర్(యు) జెడ్పీటీసీ కోవ అరుణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ యాదవరావులు మంగళవారం ఆయన్ను పరామర్శించారు. ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా ఉన్నారు.